క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

వంగర: మండలంలోని కె.కొత్తవలసలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వేమకోటి రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



సూచనలిస్తున్న ఏపీఎం చక్రపాణి

వంగర: స్వయంశక్తి సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీఎం మీసాల చక్రపాణి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో శనివారం సమావేశమైన ఆయన స్త్రీనిధి రుణాలతో పాటు బ్యాంకు లింకేజీ ద్వారా పొందిన రుణాలతో వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి, ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ స్వయఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నించాలన్నారు.

జగనన్న కాలనీలో ఏడు బోర్లు ఏర్పాటు



జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మరో బోరు

రాజాం: మండలంలోని కంచరాం సమీపంలో ఉన్న జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్‌లో కొత్తగా ఏడు బోర్లు(చేతిపంపులు) ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు శనివారం తెలిపారు. నిర్మాణాలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా కల్పించిన ఈ సదుపాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తగా వేసిన బోర్లకు మోటార్ కనెక్షన్ ఇచ్చి, నేరుగా నిర్మాణాల దగ్గరే నీటిని అందిస్తున్నామన్నారు. ఇల్లు కట్టిన వారికి బిల్లులు సకాలంలో సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులంతా భాగస్వాములు కావాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్నులు, స్పందన ఫిర్యాదులు, ఆర్‌టీఐ చట్టం, పారిశుద్ధ్య పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పన్ను చెల్లించని వారి వద్దకు వెళ్లి పన్ను వసూలు చేయాలని, పన్ను వసూల లక్ష్యం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి డీఎస్పీ సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు

బాడంగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పెండింగ్ కేసుల రికార్డులు పరిశీలించి, కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ ఆర్.జయంతి తదితరులు ఉన్నారు.

వేతనదారులందరికీ పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి: ఉపాధి హామీ పథకం వేతనదారులందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు, టీఏలతో సమావేశమైన ఆయన గతంలో నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన పనులు చేయాలని, వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన ఎవరూ పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఓ జనార్దన్, ఈసీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్’ను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రాజాం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: నియోజకవర్గంలో ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లతో శనివారం వారు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని, ఇప్పటివరకు ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి, చరిత్ర సృష్టించారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌నే మళ్లీ సీఎం చేయాలన్నది ప్రజల ఆకాంక్ష అని అన్నారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం చేపట్టిందన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారని, అందరూ ఆయన ఆశయ సాధనకు సమష్టిగా పనిచేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, రాజాం పట్టణ, రూరల్ పార్టీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్. రాజగోపాలనాయుడులు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: రేజేరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఆనవరం, రేజేరు, కోటిపల్లి గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో శనివారం సమావేశమైన ఆయన గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి వారం రోజుల పాటు చేపట్టే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా దాదాపు నాలుగేళ్లుగా ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. ఆయన ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం సచివాలయం-2లో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సచివాలయం-1, 2, 3 పరిధిలోని గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన ఆయన లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న మేలు, గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలులో ఉన్న తేడా ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, సచివాలయ కన్వీనర్లు కె.శ్రీనివాసరావు, సీహెచ్ తవిటినాయుడు, సీహెచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



తెర్లాం: మాట్లాడుతున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులను ప్రతీ ఇంటికి వెళ్లి, వివరించాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లోచర్ల, ఆమిటి, కొరటాం, విజయరాంపురం, ఉద్దవోలు, సుందరాడ గ్రామ సచివాలయాల్లో ఆ గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన ఆయన పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఎన్నికల హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. ప్రతీ వర్గానికి మేలు చేయడం కోసం ఆయన పడే తపన వర్ణించలేనిదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.బాబ్జీరావు, సచివాలయాల మండల కన్వీనర్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై మండల ప్రత్యేకాధికారి అసహనం



ఎంపీడీఓ రమామణిపై అసహనం వ్యక్తం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు

రామభద్రపురం: మండల ప్రత్యేకాధికారిగా తనను వద్దనుకున్నా.. ఎంపీడీఓ కార్యాలయానికి తాను రావడం నచ్చకపోయినా చెప్పాలని.. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి గోవిందరావు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయానికి రాగా, ఎంపీడీఓతో పాటు సిబ్బంది ఎవరూ ఆయనను పట్టించుకోకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఇక్కడ గౌరవం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వారానికోసారి మండలానికి వస్తే మీలో ఎవరికీ సీరియస్‌నెస్ లేదని, అధికారులు సైతం సమీక్షా సమావేశాలకు సక్రమంగా రావడం లేదన్నారు. సమావేశాలకు మండల స్థాయి అధికారులు రాకుండా వారి వద్ద ఉన్న దిగువ స్థాయి అధికారులను పంపించడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన గత వారం తాను మామిడివలస అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించగా, అక్కడ కేంద్రం నిర్వహణ సక్రమంగా లేదన్నారు. అలాగే మండల వ్యవసాయ కార్యాలయంను పరిశీలించగా, అక్కడ వ్యవసాయాధికారి సమయపాలన పాటించడం లేదని తెలిపారు. అధికారులు సమయపాలన పాటించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని మండిపడ్డారు. అధికారులమంతా సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆశయాన్ని నీరుగార్చే విధంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి సఖి సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా తక్కువ వయసున్న ఆడపిల్లలకు వివాహాలు చేసేస్తున్నారని, ఆ విధంగా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాల వల్ల ఆ బాలికకే నష్టం జరుగుతుందన్న విషయం అందరికీ తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ కిశోరి బాలికలకు విద్య, ఆరోగ్యంపై సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది అవగాహన పెంపొందించాలన్నారు. వివాహ వయసు వచ్చేంత వరకు బాలికలకు పెళ్లిళ్లు చేయకుండా చూడాలన్నారు. తక్కువ వయసులో పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే అడ్డుకుని, అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కిశోరి బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే వారిని సఖి గ్రూపుల్లో కూడా చేర్పించాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ దీక్షితారాణి మాట్లాడుతూ బాలికలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ఆస్పత్రికి వచ్చి, వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ త్రినాధరావు, ఏపీఎం రాము, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పార్టీ విజయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: సమష్టి కృషితో 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జోష్యం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లతో శనివారం సమావేశమైన ఆయన ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేపడితే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయం మనదేనన్నారు. అంతకుముందు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లను ఒక్కొక్కరిని ఎమ్మెల్యే, పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరి మధ్యనైనా పొరపొచ్చాలుంటే మరిచిపోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ఏదేని సమస్య వస్తే ఇకనుంచి తనను నేరుగా సంప్రదించాలని, పార్టీకి సంబంధించి ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు టి.భాస్కరరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు) తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

రాజాం సిటీ: మండల పరిధిలోని అంతకాపల్లి పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు రామానుజస్వామి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయని, ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అంకురార్పణం, ధ్వజారోహణం, ఊంజల్‌సేవ, కల్యాణోత్సవం, గరుడ వాహనసేవ, చక్రస్నానం, పుష్పయాగం నిర్వహించనున్నామన్నారు. తొలిసారిగా తిరుమల దేవస్థానం అర్చకుల సమక్షంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

మెంటాడ: ఆడపిల్లలపై వివక్ష తగదని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సఖి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆడపిల్లలను చిన్నతనం నుంచే గౌరవించేలా పిల్లలను పెంచాలన్నారు. వారికి మంచి, చెడు ఎప్పటికప్పుడు చెబుతూ సమాజంలో ఉన్నతమైన విలువలు కూడిన స్థాయికి ఎదిగేలా మనం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

మెంటాడ: ఆడపిల్లలపై వివక్ష తగదని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సఖి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆడపిల్లలను చిన్నతనం నుంచే గౌరవించేలా పిల్లలను పెంచాలన్నారు. వారికి మంచి, చెడు ఎప్పటికప్పుడు చెబుతూ సమాజంలో ఉన్నతమైన విలువలు కూడిన స్థాయికి ఎదిగేలా మనం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రంగప్పచెరువు మదుముల పరిశీలన



చెరువు మదుములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ రాజేష్‌కుమార్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామంలో ఉన్న రంగప్పచెరువు మదుములను ఇరిగేషన్ ఏఈ రాజేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన రైతులు స్పందన కార్యక్రమంలో చెరువు మదుములు బాగుచేసి, ఆయకట్టుకు సక్రమంగా నీరందేలా చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి, చెరువు గట్టుతో పాటు మదుముల పరిస్థితిని పరిశీలించారు. ఈ చెరువు కింద దాదాపు 350 ఎకరాల ఆయకట్టు ఉందని, ప్రస్తుతం మదుముల వద్ద ఇసుక బస్తాలు రైతులు వేసుకున్నట్లు గమనించామన్నారు. చెరువు మూడు మదుముల వద్ద షట్టర్లు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నామని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని గ్యాస్ ఆఫీస్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని టౌన్ సీఐ కె.రవికుమార్ శనివారం ప్రారంభించి, అటువైపుగా వెళ్తున్న పలువురికి తాగునీరు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రయాణికులు, పాదచారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కె.సాయిప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్ పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయండి



ర్యాలీలో సీఐటీయూ నాయకులు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన యూనియన్ సభ్యులతో కలిసి స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శనివారం ర్యాలీ నిర్వహించి, అనంతరం రైలులో ఢిల్లీకి బయలుదేరారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నుల వితరణ



విద్యార్థులకు అట్టలు అందిస్తున్న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం

రేగిడి: మండలంలోని సంకిలి, దేవుదళ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం శనివారం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీటిని వారికి అందజేస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో ప్యారీ సుగర్స్ ఏవీపీ ఎ.నాగిశేషారెడ్డి, కేన్ డీజీఎం రమేష్ రెడ్డి, కేన్ ఏజీఎం కె.అప్పారావు, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోండి

తెర్లాం: మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి కోరారు. శనివారం మండల కేంద్రానికి విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ విపత్తు సమయంలో తల్లిదండ్రులు మరణించడంతో అనాథలైన పిల్లలు, భార్యాభర్తలు విడాకులు తీసుకోవడంతో తల్లి దగ్గర కానీ తండ్రి దగ్గర కానీ ఉంటున్న పిల్లలు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ నెల 5వ తేదీలోగా బాడంగి ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.75 వేలు లోపు ఉండాలన్నారు. తల్లిదండ్రుల మరణ ధ్రువపత్రాలు, పిల్లల పుట్టిన తేదీ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డులు, రైస్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, ఇతర ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతచేసి ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలను గానీ, సచివాలయ మహిళా పోలీసులను గానీ సంప్రదించాలన్నారు.

శతశాతం ఆధార్ అనుసంధానం పూర్తి

రామభద్రపురం: నియోజకవర్గంలోని రేషన్‌కార్డుదారుల రేషన్‌కార్డులకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడం శతశాతం పూర్తయిందని సీఎస్‌డీటీ, మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ సాయికృష్ణ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన రామభద్రపురం మండలంలో 15,145, బొబ్బిలి మండలంలో 35,578, తెర్లాం మండలంలో 18,569, బాడంగి మండలంలో 14,643 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. వీటన్నిటికీ ఆధార్ లింక్ నమోదు చేయడం జరిగిందన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కలు పెంచడంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వాసవీ క్లబ్ మనరాజాం-సారథి సభ్యుడు గ్రంధి రవికుమార్ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో శనివారం సభ్యులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, ఏప్రిల్ ఫూల్ కాదని, ఏప్రిల్ కూల్ అని నిరూపించాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లోనూ, ఇంటి పెరటిలోను మొక్కలు నాటి, పరిసరాలను పచ్చదనంగా మార్చుకోవాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



బొబ్బిలి: భూముల వీధిలో ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టు



వీవీఆర్‌పేట-రాజులగుమ్మడ రోడ్డుపై నేలకూలిన విద్యుత్ స్తంభం



బొబ్బిలి: కురుస్తున్న వర్షం

వంగర: మండలంలోని వీవీఆర్ పేట, జేకేగుమ్మడ, చినరాజులగుమ్మడ, పెదరాజులగుమ్మడ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం శనివారం కురిసింది. గాలులకు ఆయా గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వంగర, మద్దువలస, శివ్వాం, ఎం.సీతారాంపురం, మగ్గూరు, సంగాం ప్రాంతాల్లో ఓ గంటసేపు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈదురుగాలులతో శనివారం కురిసిన వర్షానికి ఇందిరమ్మ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ వెనక విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు తెగి, నేలపై పడ్డాయి. దీంతో గంటసేపు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. ఈఈ పూడి హరి ఆధ్వర్యంలో ఏఈ సాంబశివరావు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ తెలిపారు. మండలంలోని దేవుదల, మజ్జిరాముడుపేట, అప్పాపురం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఆమె అక్కడి లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ఇక్కడ అందించే బాలామృతంలో పౌష్టికాహారం ఉందని, దానిని తప్పకుండా ఆహారంగా తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. చిన్నారుల ఎత్తు, బరువు కూడా ప్రతిరోజూ చూడాలన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని మండలాల్లో ఉన్న పలు గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులంతా జగనన్న కాలనీల్లో పర్యటించి, ఇళ్ల నిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు. ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని వారు త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలని, వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ నెలలో జరిగే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని లబ్ధిదారులను కోరారు. నిర్మాణాలు చేస్తున్న వారికి సకాలంలో నిర్మాణ సామగ్రి, బిల్లులు చెల్లించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అందరూ నిర్మాణాల పూర్తికి మరింత చొరవ తీసుకోవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



రాజాం: కొఠారిపురంలో హౌసింగ్ డే కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరరావు



రేగిడి: ఉంగరాడమెట్టలో జరిగిన కార్యక్రమంలో అధికారులు



తెర్లాం: లబ్ధిదారులకు సూచనలిస్తున్న ఏఈ వెంకటేష్



బాడంగి: ఆకులకట్ట గ్రామంలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న ఎంపీడీఓ అక్కారావు